International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.10, Issue-4, October-December, 2023
Impact Factor: 6.023; email: drtvramana@yahoo.co.in

# సార్వజనీన సామాజికతను ప్రతిబింబించిన 'కుమార శతకం'

**డా. పొట్లూరి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్,**
**ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చింతలపూడి,**
**ఏలూరుజిల్లా – 534460**
**చరవాణి: 9390883982**
**మెయిల్:** johnveslyp@gmail.com

1. పరిచయం:

"సహితేన హితం సాహిత్యం" అని ఆర్యోక్తి. సాహిత్యం ఏ కాలానికి యుగానికి సంబంధించిన దైనా అది సర్వజనుల హితాన్ని కోరే విధంగా వుంటే ఆ సాహిత్యం పదికాలాల పాటు నిలిచి వుంటుంది. వేదాలు, పురాణాలు, కావ్య, ప్రబంధాలు, శతక సాహిత్యం ఇలా ఏ పేరుతో వున్నా అవి అన్నీ మనిషిని మనిషిగా బ్రతకమనే నీతులనూ, ధర్మాలనూ బోధించేవే. అందుకే తెలుగుసాహిత్యం ప్రారంభమై ఇన్ని శతాబ్దాలు గడిచినా ఇంకా ఆ మాధుర్యం తగ్గకపోవడానికి కారణం ఆయా సాహిత్యాల రూపకల్పనలో విలువల ప్రాధాన్యాన్ని పొందుపర్చడమేనని చెప్పవచ్చు.

తెలుగుసాహిత్య చరిత్రలో శతకసాహిత్యానికి ఒక ప్రత్యేకత వుంది. సంఘంలోని లోపాలను ఎత్తి చూపడంతో పాటు, సంఘంలోని వ్యక్తులు పాటించవలసిన నీతులనూ, ధర్మాలనూ, విలువలనూ, చిన్నచిన్న పద్యాలలో పొందుపర్చి వాటిని సర్వకాలాలలో సర్వజనహితంగా మలచిన ఘనత శతక పద్యాలది. చూడటానికి చిన్నపద్యాల రూపంలోనే వున్నా ఎన్నో జీవిత సత్యాల్ని, మరెన్నో సాంఘిక వాస్తవాల్ని కళ్ళకు కట్టినట్లు వర్ణించడం వల్ల శతక పద్యాలు ప్రత్యేకతను సంతరించు కున్నాయి.

దాదాపు 12వ శతాబ్దిలో ప్రారంభమైన శతకరచన శాఖోపశాఖలుగా ప్రవర్తిల్లి తెలుగు సాహిత్య చరిత్రలో ఒక నూతన ప్రక్రియగా నిల్చిపోయింది. ప్రాకృత సంస్కృత ప్రక్రియలను అనుసరించే శతక రచన ప్రారంభమైనా కాలక్రమంలో ఒక విశిష్ట ప్రక్రియగా తన ప్రాభవాన్ని నిల్పుకుంది. క్రీ.శ. 1160- 70 ప్రాంతంలో మల్లికార్జున పండితుడు మొట్టమొదటి శతకకర్తగా గుర్తింపబడినప్పటికీ శతక రచనకు విశేష ప్రాధాన్యాన్ని, గౌరవాన్ని కల్పించింది మాత్రం పాల్కురికి సోమనాథుడు అని చెప్పవచ్చు. పాల్కురికి రాసిన వృషాధిపశతకం సంపూర్ణమైన శతక లక్షణాలను కలిగి వుండి తర్వాత వచ్చిన శతక కవులకు ఒక మార్గదర్శకంగా నిలిచిందని చెప్పడం అతిశయోక్తి కాదు.

**2. కుమార శతకం – ప్రత్యేకత:**

ప్రస్తుతం ఈ సదస్సులో పత్రసమర్పణ కోసం తీసుకున్న అంశం కుమార శతకం సార్వజనీన సామాజికత. శతకాలు భక్తిరూపంలో వున్నా, రక్తిరూపంలో వున్న, నీతి, వైరాగ్య, అధిక్షేప, హాస్య, కథాత్మకరూపంలో వున్న అవన్నీ సంఘానికి మంచిని ప్రబోధించాలనే నియమానికి కట్టుబడి వున్నవే నని చెప్పవచ్చు. ఎందుకంటే సంఘంలో అనేక రూపాలలో వున్న అనేక విషయాలను తనదైన శైలిలో వ్యక్తపర్చడం ఇందులో గమనార్హం. ప్రత్యేకించి కుమారశతకం కూడా అనేక విషయాలను వివరించింది.

**2.1. సద్గోష్ఠి వల్ల ప్రయోజనాలు వివరించే పద్యాలు:**

మానవుడు సంఘజీవి. తను మాత్రమే కాకుండా తన చుట్టూవున్న అందరితోనూ వ్యవహరించే టప్పుడు కొన్ని కట్టుబాట్లు, నియమాలు తప్పనిసరిగా పాటించాలి. ఈ క్రమంలోనే వ్యక్తిగత నీతి విషయంలో ప్రతీ వ్యక్తి ఎంతో జాగరూకతతో వ్యవహరించాలి. ఈ విషయాల్ని కుమారశతకంలో ఆ శతకకర్త ఎంతో చక్కగా వివరిస్తారు.

సద్గోష్ఠి సిరియు నొసంగును
సద్గోష్ఠియె కీర్తి పెంచు సంతుష్టిని నా
సద్గోష్ఠియె యొనగూర్చును
సద్గోష్ఠియె పాపములను జంపు కుమారా!

సమాజంలో మంచివారితో స్నేహంచేయడం ఎంత అవసరమో, వారితో స్నేహం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలు ఎలా వుంటాయో, సద్గోష్ఠికి వున్న ప్రాధాన్యం ఎటువంటిదో వివరిస్తున్నాడు శతక కర్త. సజ్జనులతో సహవాసం చేయడం సంపదలను మాత్రమే కాకుండా కీర్తినీ, వృద్ధినీ కూడా కలిగిస్తుంది. తృప్తిని కలిగించడమే కాకుండా పాపాలను కూడా పోగొడుతుంది. కనుకనే సజ్జనులతో సహవాసం చేయడం ప్రతీ వ్యక్తికీ ఎంతో అవసర విషయం అని చెప్తున్నాడు. అంతేకాకుండా ఎవరితో స్నేహం చేయాలో, ఎవరితో చేయకూడదో కూడా ఈ క్రింది పద్యంలో చెప్తున్నాడు.

సరివారిలోన నేర్పున
దిరిగెడు వారలకు గాక తెరవాటులలో
నరయుచు మెలగెడి వారికి
పరువేటికి కీడె యనుభవంబు కుమారా!

తనతో సమానమైన వారితో నడుచుకుంటే గౌరవము కీర్తీ లభిస్తాయి. అలాకాక దుష్టులతోనూ, దొంగలతోనూ స్నేహం చేసినట్లయితే వున్న గౌరవాన్ని కూడా పోగొట్టుకుని ఎంతో అపకీర్తిని మూటగట్టుకుంటాము. ఈ విషయాలు ప్రస్తుతం మన సమాజంలో మనం చూస్తున్నవే, మన అనుభవంలో వున్నవే.

**2.2. వ్యక్తిగత నీతుల్ని ప్రబోధించే పద్యాలు:**

బాల్యం ప్రతీ మనిషి జీవితంలోనూ ఒక చెరగని ముద్రవేస్తుంది. బాల్యంలోని వ్యక్తి ప్రవర్తన అతని భవిష్యత్తుని నిర్ధారిస్తుందని చెప్పడం అతిశయోక్తి కాదు. మనిషి చిన్నతనం నుండీ ప్రవర్తించవలసిన విధానాన్ని ఈ క్రింది పద్యంలో వివరిస్తున్నాడు కుమారశతకం.

అతి బాల్యములోనైనను,
ప్రతికూలపు మార్గముల ప్రవర్తింపక స
ద్గతి మీర మెలగ నేర్చిన
నతనికి లోకమున సౌఖ్యమగును కుమారా!

ఏ మనిషైనా చిన్నతనం నుండే వ్యక్తిగత ప్రవర్తనను సరిచూసుకోవాలి. మంచిమార్గంలో నడవ డానికి ప్రయత్నించాలి. అతడు చిన్నవాడైనప్పటికీ విరుద్ధ మార్గంలో గనుక నడవకుండా మంచి మార్గంలో నడిచినట్లైతే

వాడు లోకంలో సుఖంగా జీవిస్తాడని చెప్తున్నాడు శతకకర్త. అంతేకాక తల్లిదండ్రులకు విధేయుడిగా, వారికి మంచి కీర్తి ప్రతిష్టలను తెచ్చే కుమారులుగా ఉండడం ఎలాగో కూడా చెప్తున్నాడు కవి.

తనయుడు చెడుగై యుండిన
జనకుని తప్పన్నమాట సత్యమెరుగు గా
వున నీ జననీ జనకుల
కు నపఖ్యాతి యగురీతి గొనకు కుమారా!

బాల్యం సరిగా లేని వ్యక్తుల ప్రవర్తన సమాజంలో ఎన్నో అనర్థాలకు దారితీస్తుంది. అబద్ధాలు చెప్పడం, దొంగతనాలు చేయడం వంటి సంఘ వ్యతిరేక కార్యక్రమాలు చేయడం వల్ల ఆ వ్యక్తుల యొక్క తల్లిదండ్రులకు ఎంతో అపకీర్తి వస్తుంది. కుమారుడు తప్పు చేస్తే దానికి బాధ్యత తండ్రిదే అంటుంది సమాజం. అందుకే ప్రతీ పిల్లవాడు పెరిగి పెద్దయ్యేకొద్దీ తన తల్లిదండ్రులకు పేరుతెచ్చే పనులే చేయాలి. దానివల్ల వ్యక్తిగతంగా అతని కీర్తి ప్రతిష్టలు పెరగడమే కాకుండా తల్లిదండ్రులకు కూడా ఎంతో పేరుతెచ్చినవాడౌతాడు.

**2. 3. పెద్దల పట్ల ప్రవర్తించవలసిన విధానాన్ని చెప్పే పద్యాలు:**

ప్రస్తుత సమాజంలో మారుతున్న పరిస్థితుల్లో గౌరవం అనేమాట కొత్తగా అనిపిస్తుంది. ఎందుకంటే ఇప్పటి తరాలు పెద్దవారిని గౌరవించడంలో వెనకడుగులోనే వున్నారని చెప్పవచ్చు. ఒకప్పుడు పెద్దవారిని గౌరవించిన విధానానికి, ఇప్పుడు గౌరవిస్తున్న విధానానికి ఎన్నో మార్పులు చోటుకున్నాయి. కానీ పెద్దవారిని గౌరవించిన వ్యక్తి జీవితం ఎలా వుంటుందో ఈ క్రింది పద్యంలో శతకకారుడు వివరిస్తున్నాడు.

పిన్నల పెద్దలయెడ కదు
మన్ననచే మెలగు సుజన మార్గంబుల నీ
వెన్నికొని తిరుగుచుండిన
నన్నియెడల నెన్న బడుదువన్న కుమారా!

చిన్నవారితోనైనా, పెద్దవారితోనైనా వారిని చూచినప్పుడు మర్యాదతో ప్రవర్తించడం ప్రతీ వ్యక్తికి అవసరం. అంతేగాక మంచివారు నడిచే దారిలో నడుస్తూ ఉంటే దానిని చూచిన వారందరూ నిన్ను పొగుడుతారు. దానివల్ల ఎంతో ఖ్యాతి లభిస్తుంది అని చెప్పడం ప్రతీ వ్యక్తి జీవితంలోనూ పాటించవలసిన నీతిగా నిల్చిపోతుంది. దానితోపాటే పెద్దలను ఆటపట్టించడం, వారు వచ్చినపుడు వారిని సరిగా గుర్తించకపోవడం, గౌరవించకపోవడం మొదలైన అంశాలను కూడా వివరిస్తున్నాడు.

పెద్దలు విచ్చేసినచో
బద్దకముననైన దుష్టపద్ధతి నైనన్,
హద్దెరిగి లేవకున్నన్
మొద్దువలెం జూతురతని ముద్దు కుమారా!

లోకంలో అతి సహజంగా మనకు కనిపించే అంశాన్ని అతి సుందరంగా వివరిస్తున్నాడు ఈ పద్యంలో. పెద్దలు మన దగ్గరకు వచ్చినపుడు సోమరితనం చేతనైనాగానీ, దుష్టప్రవర్తన చేతనైనాగానీ వారిని మర్యాదతో

గౌరవించకపోతే వారు మనల్ని మొద్దులాగా చూస్తారుగానీ ప్రాణం వున్న వ్యక్తిగా భావించరు. కనుక పెద్దల పట్ల ప్రతీవ్యక్తి గౌరవంతోనూ, భక్తితోనూ ప్రవర్తించడం ఎంతో అవసరం.

**2.4. ఇతర నీతులు:**

పైన వివరించిన విషయాలనే కాకుండా ఇంకా అనేక అంశాల పట్ల నేటితరంలో స్ఫూర్తిని కలిగించే ప్రబోధం కూడా మనకు కుమార శతకంలో కనిపిస్తుంది. సమాజంలో ఉపాధ్యాయునికి ఎంతో గౌరవం వుంది. వ్యక్తిలోని అంధకారాన్ని విద్య ద్వారా తొలగించి అతనిలో వెలుగు నింపే గురువు అందరికీ భగవంతుడితో సమానం. ఈ భావాన్నే ఈ క్రింది పద్యంలో చెప్తున్నాడు.

ఆచార్యున కెదిరింపకు
బ్రోచిన దొర నిందసేయ బోకుము కార్యా
లోచనము లొంటి జేయకు
మాచారము విడువబోకుమయ్య కుమారా!

ప్రస్తుత సమాజంలో గురువులను ఎదిరించడం, వారిని అవమానించడం వ్యాప్తనైపోయింది. మన సినిమాలలో కూడా ఉపాధ్యాయులను కించపర్చేలా అనేక అంశాలను పొందుపరుస్తున్నారు. గురువును అవమానపర్చడం మంచిది కాదనే విషయాన్ని చెప్తూనే ఆచారాన్ని వదిలిపెట్టవద్దనే ప్రబోధం వుంది ఈ పద్యం. అంతేగాక ఏదైనా కష్టం నుంచి మనల్ని కాపాడిన వారి పట్ల కృతజ్ఞతతో వుండాలి గానీ వారిని తిట్టడం ఏ వ్యక్తికీ మంచిది కాదు. ఏదైనా విషయంలో ఆలోచన చేయవలసి వస్తే ఒంటరిగా కాకుండా పెద్దవారిని, మన శ్రేయస్సు కోరేవారిని సంప్రదించడం మంచిదనే విషయాన్ని చెప్తున్నాడు.

సమాజమంటే మనం మాత్రమే కాదు. మనతోపాటు అనేకమంది వుంటారు. వారంతా ఒకేలా వుండరు. అనేక లోపాలతో ఉండేవారు అనేకమంది వుంటారు. కనుక అందరినీ సమాన దృష్టితో చూడాలి తప్ప వారి లోపాల్ని బట్టి వారిని కించపర్చరాదని చెప్పిన ఈ క్రింది పద్యంలోని విషయం ఏ కాలంలోనైనా నిత్యనూతనమే.

అవయవహీనుని సౌంద
ర్య విహీను దరిద్రుని విద్య రానియతని సం
స్తవనీయు, దేవశృతులన్
భువి నిందింప దగదండ్రు బుధులు కుమారా!

ఎంత చదువుగలిగిన వారైనా ఏదో ఒక సందర్భంలో ఎవర్నో ఒకర్ని అవహేళన చేస్తూనే వుంటారు. వికలాంగుల్ని, కురూపుల్ని, ధనం లేనివారిని, చదువులేనివానిని సన్మార్గుల్ని, భగవంతుని, పవిత్ర గ్రంథాలను కించపర్చడం, అవహేళన చేయడం మంచిది కాదని అందరూ గుర్తెరగడం ,ఆ విధంగా నడచుకోవడం ప్రస్తుత సమాజానికి ఎంతైనా అవసరం.

ప్రతీ వ్యక్తికీ జీవితంలో అనేక లక్ష్యాలుంటాయి. వాటిని చేరుకోవడానికి ఎంతో శ్రమపడు తుంటారు. కానీ కొన్నిసార్లు మనం అనుకున్న లక్ష్యాలను చేరడంలో సఫలం అయితే కొన్నిసార్లు విఫలమవుతుంటాం. సఫలమైనా విఫలమైనా ఏదైనా సరే నీలో పట్టుదలను పెంచాలికానీ నిరాశను కలిగించకూడదు అనే ప్రబోధం ఈ క్రింది

పద్యంలో మనకు కనిపిస్తుంది.

వగవకు గడిచిన దానికి
పొగడకు దుర్మతులనెపుడు పొసగని పనికై
యెగి దీనత నొందకుమీ
తగదైవగతిం పొసంగు ధరను కుమారా!

జీవితం నిరంతర ప్రవాహం. జీవితంలో ఏది పొందినా ఏది పోగొట్టుకున్నా మనకోసం ఆగదు. సాగిపోతూనే వుంటుంది. అందుకే అయిపోయిన పనిని గురించి ఎప్పుడూ ఆలోచించవద్దు, బాధపడవద్దు. దుష్టులను మెచ్చుకోవడం, నీకు సాధ్యం కానిదానిని పొందలేకపోయానని బాధపడడం మనిషికి మంచిది కాదు. మనకు ఉన్నదానితోనే, భగవంతుడు మనకిచ్చిన దానితోనే తృప్తి కలిగి సంతోషంతో జీవించడం వల్ల మనిషి ఆనందంగా వుంటాడనే విషయాన్ని ప్రతీ వ్యక్తి నిరంతరం మననం చేసుకోవాలి. పై విషయాలే కాకుండా ఏ కాలంలోని వారికైనా వర్తించే కొన్ని నియమాలు, సూత్రాలను కూడా కుమారశతకకర్త చెప్పడం ఈ శతకంలో మనకు కనిపిస్తుంది.

చేయకుము కాని కార్యము
పాయకుము మరిన్ శుభం, బవని భోజనమున్
జేయకుము రిపు గృహంబున,
కూయకు మొరు మనసు నొచ్చు కూత కుమారా!

ఏ పని చేయకూడదో, ఏ పని చేయకూడదో ప్రతీ వ్యక్తి అతని పరిస్థితుల్ని బట్టి నిర్ణయించు కుంటాడు. కొన్ని సమయాల్లో ఏ పని ఎలా చేయాలో తెలియకపోతే పెద్ద సలహా తీసుకోవడంలో తప్పులేదు. కానీ తెలిసీ తెలియకుండా కానిపనిని చేసి అందరిలోనూ చులకన కావద్దనే హితవు మనకు కనిపిస్తుంది. అంతేకాక మంచిదానిని వదలవద్దు అనే హితోక్తి, పగవాని ఇంట భోజనం చేయవద్దనే హెచ్చరిక కూడా మనల్ని ఆలోచనలో పడవేస్తుంది. ఇక జీవితంలో ప్రతీ వ్యక్తి గుర్తుంచుకుని పాటించవలసిన విషయం ఇతరుల మనసుకు కష్టం కలిగించే మాటలు మాట్లాడకూడదు అనేది. హేళనగా మాట్లాడి ఇతరుల మనసును నొప్పించడం అనేది ఏ మనిషికీ అంత మంచిది కాదనే విషయాన్ని చిన్నపద్యంలో ఎంతో హృద్యంగా చెప్తున్నాడు శతకకర్త.

జీవితంలో చదువుకు ఎంతో ప్రాధాన్యం ఉంది. ఎన్నో కష్టాలను భరించి, ఆటుపోట్లకు ఎదురీది తాము కోరుకున్న స్థాయికి చేరుకున్న వ్యక్తులెందరో మనకు కనిపిస్తూనే ఉంటారు. అందువల్లే జీవితంలో ఎంత తీరికలేకుండా ఉన్నా, ఎన్ని పనులతో సతమతమవుతూ ఉన్నా చదువు విషయంలో ఆసక్తి కలిగి వుండాలనే విషయాన్ని ఈ క్రింది పద్యంలో చెప్తున్నాడు శతకకర్త.

పనులెన్ని కలిగియున్నను
దిన దినముల విద్యపెంపు ధీయుక్తుడవై
వినగోరుము సత్కథలను
కని విబుధులు సంతసించు గతిని కుమారా!

మంచిమంచి కథలను వినడం అనేది వ్యక్తిలో ఆసక్తినే కాకుండా ఆలోచనను కూడా కలిగిస్తుంది. వాటిద్వారా వ్యక్తులు వాళ్ళ ప్రవర్తనను సరిచేసుకుని సమాజంలో మంచి పౌరులుగా పేరుతెచ్చుకోగలుగుతారు. కనుక చదువుమీద ఆసక్తిని వదలకుండా పెద్దలందరూ మెచ్చుకునేటట్లుగా మంచి కథలను పరిశీలించి తద్వారా వారి జీవితానికి మంచి పునాదిని ఏర్పాటుచేసుకోమనే సూక్తిని చెప్తున్నాడు కవి.

**ముగింపు:**

వ్యక్తిగతంగానూ, సంఘపరంగానూ జీవించే మానవులు తమ జీవితంలో నీతినీ, ధర్మాన్నీ, విలువల్నీ ఒక భాగంగా చేసుకుంటే అనర్థాలు జరగకుండా ఉంటాయి. ప్రస్తుత సమాజంలో విలువలు కనుమరుగవు తున్నాయి. కనుక విలువల్ని కాపాడవలసిన బాధ్యత ప్రతీ ఒక్కరి పైనా ఉంది. అందుకే శతకపద్యాలు ప్రతి ఒక్కరు కంఠస్థం చేస్తే తమను తాము సంస్కరించుకోగలుగుతారు. తద్వారా మంచిపౌరులుగా మంచి సమాజ నిర్మాణానికి దోహదం చేస్తారు. పైన చెప్పిన కుమారశతకమే కాకుండా తెలుగు సాహిత్యంలో ఇంకా ఎన్నో శతకాలున్నాయి. వాటిన్నింట్లోనూ చెప్పిన విషయాల్ని అవగాహన చేసుకుని, వాటిని అనుసరించి నడుచుకోవడం వల్ల ఉత్తమ సమాజ నిర్మాణం సాధ్యమౌతుంది.

..................................

**ఉపయుక్త గ్రంథాలు / వ్యాసాలు:**

1. శ్రీ కుమార శతకము, 1933, ఉభయ భాషా ప్రవీణ శ్రీ భాగవతుల దక్షిణామూర్తిశాస్త్రి విరచిత టీకా తాత్పర్యసహితము, యం.ఎస్.శర్మ & కో ప్రచురణ, గుంటూరు–తెనాలి.

2. శతక పద్యాలు వెలుగు మూటలు, రఘుపతిరావు గడప, నమస్తే తెలంగాణ, ఏప్రియల్ 24, 2021.